

టీటీడీ బోర్డులో ఇద్దరికి చోటు

తిరుమల తిరుపతి దేవస్థానం పాలకవర్గ సభ్యులుగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, రాజమహేంద్రవరం వాసి అక్కిన మునికోటేశ్వరరావు



జ్యోతుల నెహ్రూ

"టీటీడీ బోర్డు సభ్యుడిగా అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నా. వెంకన్నకు సేవ చేసుకునే భాగ్యం లభిస్తుందని ఊహించలేదు. నాకు ఈ బాధ్యత కట్టబెట్టినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు."



అక్కిన మునికోటేశ్వరరావు

"వేంకటేశ్వరస్వామివారికి సేవ చేసే భాగ్యం లభించడం చాలా సంతోషాన్ని కలిగించింది. స్వామి మీద భక్తితో రఘుదేవపురంలో వేంకటేశ్వరస్వామి ఆలయం నిర్మించాను. ప్రస్తుతం పద్మావతి ఆలయం నిర్మిస్తున్నా."

టీటీపీ పాలకవర్గాన్ని ప్రకటించారు. ఇందులో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఇద్దరికి చోటు దక్కింది. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ బోర్డు మెంబరుగా నియమితులయ్యారు. అలాగే రాజమహేంద్రవరం నగరానికి చెందిన అక్కిన మునికోటేశ్వరరావు మరో బోర్డు మెంబరుగా నియమితులయ్యారు. జ్యోతుల సీనియర్ ఎమ్మెల్యేకాగా, మునికోటేశ్వరరావుది సొంతూరు సీతానగరం మండలం రఘుదేవపురం. ఈయన కాంట్రాక్టర్. రైతు కుటుంబానికి చెందిన మునికోటేశ్వరరావు చెరుకూరి గ్రూపు అధినేత చెరుకూరి వీర్రాజుకు స్వయాన అల్లుడు. - వివరాలు 6లో

ఆనందరవళి దీపావళి!

- విజయానికి గుర్తుగా జరుపుకునే పర్వదినం
- అంతటా పండుగ వాతావరణం
- బాణసంచా ధరలు పైపైకి
- తగ్గిన కొనుగోళ్లు
- నేటి మార్కెట్‌పైనే ఆశలు
- జిల్లాలో 549 బాణసంచా సామాగ్రి దుకాణాలకు అనుమతులు



నేడు దివ్వెల పండుగ.. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే పండుగ. పిల్లలు, పెద్దలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకునే వేడుక. పిల్లలు బాణసంచా కాల్చేటప్పుడు పెద్దలు దగ్గరే ఉండాలి. లేకపోతే ప్రమాదాలు కొని తెచ్చుకున్నట్లే. వర్షం దెబ్బకు బాణసంచా అమ్మకాలపై ప్రభావం పడింది. వీటి ధరలు ఎక్కువగా ఉండడంతో కొనుగోళ్లు తగ్గాయి. గురువారం నాటి అమ్మకాలపైనే వ్యాపారులు ఆశలు పెట్టుకున్నారు.





కాకినాడలో పూల అమ్మకాలు



కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను వైభవంగా నిర్వహించుకోవడానికి జిల్లావాసులు సర్వం సిద్ధంచేసుకున్నారు. గురువారం దీపావళి పండుగ వాడవాడలా జరగనుంది. జిల్లావ్యాప్తంగా భారీగా మందుగుండు సామాగ్రి విక్రయాలు జరుగుతున్నాయి. మూడురోజుల్లో రూ.70కోట్లకు పైగా బాణసంచా విక్రయాలు జరుగుతున్నట్లు ఒక అంచనా. కాకినాడ, పిఠాపురం, సామర్లకోట, పెద్దాపురం, తుని, ఏలేశ్వరం, గొల్లప్రోలు, అన్నవరంల్లో అమ్మకాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రతి దుకాణంవద్ద అగ్నిమాపకశాఖ సూచించిన ప్రకారం ఫైర్ సేఫ్టీ మెజర్స్ తీసుకుంటున్నారు. కాకినాడలో మెక్లారిన్ హైస్కూల్ ప్రాంగణంలో, బోటుక్లబ్‌స్థలంలో, పద్మప్రియథియేటర్‌వద్ద, మెయిన్‌రోడ్డులోకౌస్తుభాహోటల్ సమీపంలో ఖాళీస్థలంలో దుకాణాలు ఏర్పాటు చేశారు. పార్కింగ్‌కోసం ప్రత్యేకంగా స్థలం కేటాయించారు. పెద్దసంఖ్యలో వినియోగదారులు వస్తే ఇబ్బందులు కల్గకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. జిల్లాలో పలు చోట్ల నియంత్రణ లేకపోవడం వల్ల రెట్టింపు ధరలకు వీటిని విక్రయిస్తున్నారు. దీంతో వ్యాపారస్తులు భారీస్థాయిలో లాభాలు ఆర్జిస్తున్నారు. మట్టి ప్రమిదలు, ఎలక్ట్రికల్ విద్యుత్ దీపాలంకరణ వస్తువులకు కూడా భలే డిమాండ్ ఉంది. కాకినాడలో పెద్దమార్కెట్, చిన్నమార్కెట్, రైతుబజార్లవద్ద ప్రమిదల వ్యాపారం పెద్దఎత్తున జరుగుతోంది. మట్టి ప్రమిదలు కొనుగోలు చేసి ప్రజలు తమ గృహాల చుట్టూ దీపాలతో వెలుగిస్తారు.

జిల్లావ్యాప్తంగా 549 దీపావళి సామాగ్రి విక్రయాల దుకాణాలకు అనుమతులు ఇచ్చినట్లు జిల్లా అగ్నిమాపకశాఖ అధికారులు వెల్లడించారు. దీనిలో 130 దుకాణాల వరకు ఒక్క కాకినాడ నగరంలో ఉండడం విశేషం.

రేపు ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నవంబర్ 1న ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లు 2,74,740మందికి ఇస్తున్నామని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం మండలస్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రూ.115కోట్లు పంపిణీకి సిద్ధం చేశామన్నారు. నవంబర్ 1న ఉదయం 6 గంటలనుంచి పంపిణీ ప్రారంభించాలని ఆదేశించారు. తొలిరోజే నూరుశాతం పంపిణీ చేయాలని ఆదేశించారు. జిల్లాస్థాయి అధికారులు, మండల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

'1న నూరుశాతం పూర్తి చేయాలి'

కార్పొరేషన్(కాకినాడ),అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో నవంబరు 1న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ నూరుశాతం పూర్తి చేయాలని కార్పొరేషన్ కమిషనర్ భావన తెలిపారు. పింఛన్ల పంపిణీపై నగరపాలక అధికారులతో బుధవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈవీఎంల పరిశీలన

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కాకినాడ కలెక్టరేట్‌వద్ద ఉన్న ఈవీఎం, వీవీప్యాట్‌ల గోదాములను జేసీ రాహుల్‌మీనా బుధవారం పరిశీలించారు. ఈవీఎంల భద్రతకు సంబంధించిన రక్షణకు తీసుకోవాల్సిన ఏర్పాట్లను పరిశీలించారు. కాకినాడ ఆర్డీవో మల్లి బాబు, డిప్యూటీ తహసీల్దార్ జగన్నాథం పాల్గొన్నారు.

సత్యదేవుని హుండీల ఆదాయం రూ.1.22 కోట్లు 7

మానసిక స్థితి సరిగా లేకే..

- తల్లీ, కూతుళ్ల ఆత్మహత్య ఘటనలో వెలుగులోకి మరిన్ని విషయాలు
- వివాహ విషయంలో తలెత్తిన వివాదం
- తండ్రి కలలోకి వచ్చి తన దగ్గరకు వచ్చేయమన్నాడంటూ బావకు ఫోన్
- ఇద్దరి మానసిక స్థితి సరిగా లేనట్లు నిర్ధారణ
- ఇద్దరి మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి

7



మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి చేసి తరలిస్తున్న దృశ్యం

అప్రమత్తంగా ఉంటే.. ఆనంద దీపావళే!

- అజాగ్రత్తగా ఉంటే అనర్థాలు
- కొన్ని జాగ్రత్తలు తప్పనిసరి

6

హైడ్రా వాహనం ఢీకొని యువతి మృతి

- ఉప్పాడ బీచ్‌రోడ్డులో ఘటన

కొత్తపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సిమెంటు స్తంభాలనుతరలించే హైడ్రా ఢీకొని యువతి మృతిచెందిన సంఘటన బుధవారం ఉప్పాడ మినీహార్బర్ సమీపంలో బీచ్‌రోడ్డులో జరిగింది.ఉప్పాడకు చెందిన ఉమ్మిడి సంధ్య(23) సాయంత్రం మినీ హార్బర్‌కు వెళ్లి తిరిగి ఇంటికి నడిచి వెళ్తోంది. బీచ్‌రోడ్డులో అమీనాబాద్ పెట్రోల్‌బంక్‌సమీపంలో హైడ్రావాహనం ఆమెను వెనుక నుంచి ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆమెను జీజీహెచ్‌కు తరలిస్తుండగా మృతిచెందడంతో కుటుంబసభ్యులు కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదుచేయగా కేసునమోదు చేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పిఠాపురం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): డ్రెయిన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పిఠాపురం పోలీసులు బుధవారం గుర్తించారు. పట్టణంలోని డ్రైవర్స్‌కాలనీ సమీపంలో ని కనకదుర్గమ్మ ఆలయం వద్ద గల డ్రెయిన్‌లో సుమారు 35 ఏళ్ల వ్యక్తి పడిపోయి చనిపోయినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఒంటిపై వైట్ అండ్‌బ్లూ చారల టీషర్ట్, ట్రాక్‌ప్యాంటు ఉన్నాయని ఎస్ఐ మణికుమార్ తెలిపారు. అతడు 2రోజుల క్రితం ఉప్పాడ రైల్వేగేటు వద్ద రైలు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి నడుచుకుంటూ వచ్చి డ్రెయిన్‌లో పడి మరణించి ఉంటాడని భావిస్తున్నారు. ఆచూకీ తెలిస్తే పిఠాపురం సీఐ 9440796523 లేదా పట్టణ ఎస్ఐ 9440796460కి సమాచారం అందించాలని కోరారు.

కేబీకే బయోటెక్‌లో సీఐడీ సోదాలు

మెయిన్‌లో

- ఇన్వాయిస్, ప్రొడక్షన్, సేల్స్ రికార్డుల పరిశీలన
- ఉత్పత్తి, విక్రయాలకు సంబంధించి రికార్డులపై ఆరా
- ఉదయం నుంచి రాత్రి వరకూ కొనసాగిన తనిఖీలు
- తనిఖీలు చేపట్టిన ఎనిమిది మందితో కూడిన బృందం
- 5బస్తాల్లో కీలక ఫైళ్లు, హార్డ్ డిస్క్‌లు తీసుకువెళ్లిన సీఐడీ

డీఆర్వో బాధ్యతల స్వీకరణ

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి):జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో)గా జె.వెంకటరావు బుధవారం బాధ్యతలను స్వీకరించారు. కలెక్టరేట్‌లో ఆయన బాధ్యతలను స్వీకరించిన తర్వాత కలెక్టర్ షాన్‌మోహన్, జేసీ రాహుల్‌మీనాను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

జిల్లా యంత్రాంగానికి పూర్తి సహకారం

-ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్

కాకినాడ సిటీ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ అధికారిగా బాధ్యతలు చేపట్టిన జె.వెంకట్రావును ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పితాని త్రినాథరావు, కార్యవర్గం మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. డీఆర్వోను ఆయన ఛాంబర్‌లో కలిసి మొక్క అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు త్రినాథ్ మాట్లాడుతూ మంచి పనితత్వం ఉన్న జిల్లా అయినందున అన్ని విషయాల్లో జిల్లా యంత్రాంగానికి పూర్తి సహకారమందిస్తామన్నారు. డీఆర్వో నుంచి ఉద్యోగులపట్ల సానుకూలత ఆశిస్తున్నామన్నారు. దీనిపై డీఆర్వో సానుకూలంగా స్పందించారు. ఉద్యోగులు కష్టపడి పని చేయాలని, ఉద్యోగుల శ్రేయస్సు కోసం ఎంతవరకైనా సహాయం చేయడానికి ముందుంటానన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఎస్.రామ్మోహన్, కలెక్టరేట్ ప్రెసిడెంట్ శివ, వైస్ ప్రెసిడెంట్ సంధ్య, యమున, తాతారావు, కృష్ణ పాల్గొన్నారు.

ఆలయంలో డీఆర్వో ప్రత్యేక పూజలు

పోర్టుసిటీ(కాకినాడ), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): డీఆర్వోగా బాధ్యతలు చేపట్టిన జె.వెంకట్రావు కాకినాడ బాలాత్రిపుర సుందరి సమేత శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్యారావుపేటలోని ఆలయంలో ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి బాబ్జి, ఈవో వుండవల్లి వీర్రాజు చౌదరి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డీఆర్వోకు అమ్మవారి చిత్రపటం బహూకరించారు.



డీఆర్వోగా బాధ్యతలు చేపట్టిన వెంకట్రావును మర్యాదపూర్వకంగా కలిసిన రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు త్రినాథరావు

సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా కొవ్వొత్తుల ర్యాలీ

కాకినాడ క్రైం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారంరాత్రి కాకినాడ ఎస్‌డీపీవో రఘువీర్‌విష్ణు ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అమరులైన పోలీసుల త్యాగాలను స్మరించుకుంటూ కాకినాడ భానుగుడి కూడలినుంచి జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలోని పోలీస్ అమరవీరుల స్థూపం వద్దకు చేరుకుని స్మృత్యంజలి ఘటించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, ఆర్ఐలు నరసింహమూర్తి, వెంకట్రావు, టౌన్, రూరల్ సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు



రైఫిల్ షూటింగ్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులతో శిక్షకుడు సమీర్

రైఫిల్ షూటింగ్‌లో సత్తా చాటిన క్రీడాకారులు

కాకినాడఅర్బన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) కాకినాడ డీఎస్ఏ ప్రాంగణంలో శిక్షణ పొందిన క్రీడాకారులు వివిధ చోట్ల నిర్వహించిన రైఫిల్ షూటింగ్ పోటీల్లో పతకాలు సాధించారని శిక్షకుడు మహమ్మద్ ఆలీషా షరీఫ్ తెలిపారు. ఈనెల 27న రాజమహేంద్రవరంలో స్కూల్ గేమ్స్ అండర్-17 రైఫిల్ షూటింగ్ స్టేట్ మీట్‌లో పీప్ సైట్ ఎయిర్ రైఫిల్ విభాగంలో మొదటిస్థానం సాధించి బంగారు పతకం సాధించాడు. భీమవరం బీవీఆర్ కళాశాలలో నిర్వహించిన ఆదికవి నన్నయ యూనివర్సిటీ కళాశాలల స్పోర్ట్స్‌మీట్ పిస్టల్ ఈవెంట్‌లో ముగ్గురు విద్యార్థులు పతకాలు సాధించారు. జి.కాశి రజతం, జి.మల్లేశ్వరి, ఎం.హర్షవర్ధన్ కాంస్య పతకాలు సాధించారన్నారు. వీరిని డీఎస్ఏ సీఈవో బి.శ్రీనివాసకుమార్ అభినందించారు.

ముగిసిన రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీలు

- ఉజ్వల భవిష్యత్‌కు క్రీడలు దోహదం
- డీఎస్‌డీవో శ్రీనివాసకుమార్

కాకినాడ అర్బన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు క్రీడలు దోహదం చేస్తాయని డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్ అన్నారు. కాకినాడ జిల్లా క్రీడామైదానంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో మూడురోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి అండర్-14,17,19 టెన్నిస్ పోటీలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు ప్రదానం చేసి పతకాలు అందించారు. డీఈవో కేవీ సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రంలో శ్రీనివాసకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గౌరవఅతిథిగా తలాటం హరీష్, లాన్ టెన్నిస్ రాష్ట్ర కార్యదర్శి రామ్‌కుమార్ హాజరయ్యారు. పాఠశాలల సమాఖ్య జిల్లా కార్యదర్శి లంకా జార్జి మాట్లాడుతూ ఈ పోటీల్లో వివిధ విభాగాల్లో గెలుపొందిన 30మందిని జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఏజీఎఫ్ సంయుక్త కార్యదర్శులు సునీల్, పరుశరాం, సురేష్, పీఈటీ సంఘ జిల్లా అధ్యక్షుడు రవిరాజు, కార్యదర్శి నూకరాజు పాల్గొన్నారు.





టెన్నిస్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులు



అప్రమత్తంగా ఉంటే..
ఆనంద దీపావళే!

● అజాగ్రత్తగా ఉంటే అనర్థాలు ● కొన్ని జాగ్రత్తలు తప్పనిసరి

పండుగల్లో దీపావళి సందడే వేరు. కొత్త వస్త్రాలు, చుట్టాలు, పిండి వంటలతోపాటు ఏ పండుగ రోజూ లేని సందడి ఈరోజు ఉంటుంది. చీకటి పడే సమయానికి దీపాల వరుసలు ముచ్చట గొలిపితే.. ఆ వెంటనే బాణసంచా కాల్పుల హంగామా మొదలైపోతుంది. అయితే ఏ పండుగకూ తీసుకోనన్ని జాగ్రత్తలు కూడా దీపావళికి మాత్రం కచ్చితంగా తీసుకోవాల్సిందే. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా రెప్పపాటులో విషాదం అలుముకొనే ప్రమాదం బాణసంచా రూపంలో పొంచి ఉంటుంది. అందువల్ల చిన్నపాటి విషయాల్లో కూడా అలసత్వం అస్సలు పనికిరాదు. దీపావళిని సురక్షితంగా జరుపుకొని ఆనందించాలంటే అప్రమత్తంగా ఉండాల్సిందే. పండుగ సరదాతోపాటు పర్యావరణాన్నీ దృష్టిలో పెట్టుకోవడం కూడా మరువరాదు.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

బాణసంచా కాల్చే సమయంలో పిల్లలను పెద్దలు కచ్చితంగా గమనిస్తూ ఉండాలి. కాటన్ దుస్తులను ధరించాలి. చెప్పులు వేసుకోవాలి. బాణసంచాను ఇంట్లో కాకుండా ఆరుబయట నిల్వచేయాలి. నిల్వ చేసుకున్న బాణసంచాకు సాధ్యమైనంత దూరంగా ఒక్కొటిగా కాల్చుకోవాలి. ప్రసిద్ధ కంపెనీలు తయారు చేసిన బాణసంచా అయితే ప్రమాణాల ప్రకారం ఉంటాయి. ఐఎస్ఐ మార్కు ఉన్నవైతే ఇంకా బెటర్. బాణసంచా కాలుస్తున్న చోట రెండు మూడు బకెట్ల నీళ్లు తప్పనిసరిగా పెట్టుకోవాలి. బాణసంచా కాల్చిన తర్వాత నీటిలో పడేయాలి. బాణసంచాను వెలిగించి వాహనాలపై, మనుషులు, జంతువులపైకి విసరడం నేరం. ఒకేసారి ఎక్కువ సంఖ్యలో బాణసంచా వెలిగించడం ప్రమాదకరం. ముఖం దగ్గరగా ఉంచి కాల్చడం, కొద్దిగా కాలి లేదా ఒత్తి కొద్దిగా కాలి ఆరిపోయిన వాటి దగ్గరకు వెళ్లి కదిపి చూడడం మళ్లీ వెలిగించడం చేయరాదు. పొడవాటి కర్రతో దూరంగా తోసేయాలి. సెర్చిలైట్లు, చిచ్చుబుడ్లు వంటి వాటిని చేతితో పట్టుకొని కాల్చరాదు. అవి పేలి ప్రమాదాల బారిన పడిన వాళ్లు చాలామంది ఉన్నారు. బాంబుల వంటి వాటిని అలవాటు ఉంటేనే కాల్చాలి. కొత్త వాటితో ప్రయోగాలు చేయకూడదు. ఇతరులకు ఇబ్బంది కలగకుండా బాణసంచా కాల్చాలి. తారాజువ్వల వంటి వాటిని రోడ్లపై, ఇతరుల ఇళ్లల్లోకి వేస్తే కేసుల్లో ఇరుక్కుంటారు. దీపావళి రోజున రాత్రి వేళల్లో సాధ్యమైనంత వరకూ బయట సంచరించకపోవడమే మేలు. ఎంత మొత్తంలో మందుగుండు కాల్చేశామా అనేదికాదు.. ఎంత సురక్షితంగా దీపావళి చేసుకున్నామా అనేదే ముఖ్యమని భావించాలి.

● **దుకాణాల నిబంధనలు ఇవే..**

బాణసంచా విక్రయించే దుకాణాల విషయంలో రెండు షాపుల మధ్యలో కనీసం 3 మీటర్ల ఖాళీ ఉండాలి. ప్రతి షాపు వద్ద ఇసుకతోపాటు 200 లీటర్ల నీళ్ల డ్రమ్ములు రెండు ఉండాలి. వాటిలో జగ్గులు, నిరంతరం నిండుగా నీళ్లు ఉండాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ ధూమపానం చేయకూడదు. ఆ బోర్డులను దుకాణాల వద్ద ఉంచాలి. నిప్పు రగిల్చే వాటిని దూరంగా ఉంచాలి. దుకాణాలకు అగ్నిమాపక వాహనం సునాయాసంగా వెళ్లేలా మార్గం ఉండాలి. ఏదైనా ప్రమాదం సంభవిస్తే జనం హైరానా పడకుండా సురక్షిత ప్రాంతానికి వెళ్లాలి.

● **పార్కింగ్ ప్రాధాన్యం**

దుకాణాల సమీపానికి వాహనాలను అనుమతించకూడదు. దూరంగా పార్క్ చేసే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలి. ఒకవేళ ప్రమాదం సంభవిస్తే వాహనాల వల్ల మరింత ఎక్కువ నష్టం సంభవించే అవకాశం ఉంది. వాహనాలు అడ్డుగా ఉంటే తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోతారు. పైగా వాహనాల్లో ఉండే పెట్రోలు/డీజిలు వల్ల చిన్న ప్రమాదం పెద్దదిగా దారితీయవచ్చు. ఒకే దుకాణం వద్ద జనం గుమిగూడకుండా నియంత్రించడానికి కచ్చితంగా పోలీసులను నియమించాలి. ఫైర్ నిబంధనలు పాటించాలి.

జాగ్రత్తలతో ఆనందం



బాణసంచా నిల్వ, కాల్చే సమయంలో జాగ్రత్తలు పాటిస్తే దీపావళి ఆనందాన్ని ఇస్తుంది. ఏ మాత్రం చిన్న పొరబాటు జరిగినా విషాదమే. బాణసంచాను గ్యాస్ సిలిండర్లు, వాహనాలు, వంట గదుల్లో లేదా మండే స్వభావం ఉన్న వస్తువులు/పదార్థాల వద్ద ఎట్టి పరిస్థితుల్లోనూ ఉంచవద్దు. పెద్దల పర్యవేక్షణలోనే పిల్లలు బాణసంచా కాల్చాలి. జిల్లాలోని అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారు. కానీ ఎలాంటి ప్రమాదాలకు తావివ్వకుండా బాణసంచా కాల్చుకోవాలి.

- మార్టిన్ లూథర్ కింగ్, జిల్లా విపత్తు నిర్వహణ, అగ్నిమాపక అధికారి, తూర్పుగోదావరి

అత్యుత్సాహానికి పోవద్దు : ఏడీఎఫ్‌వో



కాకినాడ క్రైం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రానున్న దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని యువత అత్యుత్సాహానికి పోకుండా పెద్దల సమక్షంలో బాణసంచాను కాల్చాలని, కాల్చే సామగ్రి బ్రాండెడ్ కంపెనీలవై ఉండాలని కాకినాడ సాలిపేట ఏడీఎఫ్‌వో వి.సుబ్బారావు సూచించారు. బాణసంచా కాల్చేటప్పుడు చేపట్టే జాగ్రత్తలపై ఆయన కొన్ని సూచనలు చేశారు. ముఖ్యంగా ఆరోజు కాటన్ వస్త్రాలను మాత్రమే ధరించాలి. పేలే బాణసంచాలను చిన్న పిల్లలు, వృద్ధులకు దూరంగా తీసుకుని వెళ్లికాల్చాలి. బాణసంచా తగినంత సూర్యరశ్మిలో మాత్రమే ఆరబెట్టాలి. పెద్దల సమక్షంలో మాత్రమే పిల్లలు బాణసంచా కాల్చాలి. ఇళ్ల వద్ద బాణసంచా కాల్చే సమయంలో డ్రమ్మునీళ్ల సమీపంలో ఉంచుకోవాలి. రోడ్లపై నడిచే ప్రజలపైగానీ, బస్సులపైగానీ, ద్విచక్ర వాహనదారులపైగానీ బాణసంచా కాల్చకుండా జాగ్రత్తపడాలి. బాణసంచా అంటించిన తరువాత కాలలేదని నోటితో ఊదడం, తిరిగి అంటించే ప్రయత్నం అస్సలు చేయకూడదు. ఒకవేళ బాణసంచా పేలి గాయమైతే ఆ భాగంపై చల్లని నీళ్ల ధారగా పోయాలి. ఆయిల్‌గానీ, ఇంకుగానీ పోయరాదు. అనంతరం వైద్యుని వద్దకు తరలించాలి.

- సుబ్బారావు, కాకినాడ ఏడీఎఫ్‌వో




సురక్షితంగా పండగ చేసుకుందాం..

- పిల్లలను ఒంటరిగా దీపావళీ టపాసులు కాల్చకుండా చూడాలి. పెద్దలు వారి పక్కనే ఉండి వారిని గమనించాలి.
- టపాసులు కొన్ని పేలకుండా ఉండిపోతాయి. వాటిని తిరిగి వెలిగించే ప్రయత్నం అసలు చేయకూడదు.
- పేలకుండా ఉండే వాటిపై ఎప్పటికప్పుడు నీరు పోసి తడిపేయడం ద్వారా ఎవ్వరికీ హాని కలుగకుండా చూడొచ్చు.
- ఎక్కువ ధ్వనిని ఇచ్చే బాంబుల వల్ల చెవి సమస్యలు వచ్చే అవకాశాలుంటాయి. కాల్చేటప్పుడు చెవిలో దూది పెట్టుకోవాలి.
- దుస్తులపై నిప్పురవ్వలు మంటలుగా వ్యాపిస్తే వెంటనే దుప్పటితోగానీ, మందపాటి రగ్గులు, కంబళితో కప్పేసి మంటలను ఆర్పేయాలి. ఇలాంటి వాటిని దగ్గరగా పెట్టుకోవాలి.
- టపాసులతో ప్రమాదం జరిగినప్పుడు వెంటనే పిలిచేందుకు వీలుగా ఫైర్ సర్వీస్, అంబులెన్స్ పోలీస్ మొబైల్ టీమ్ ఫోన్ నంబర్లు రాసి పెట్టుకోవాలి.
- గాయాలయినప్పుడు ఐస్‌తో మర్దన చేయకూడదు. అలాగే వెన్న, గ్రీజ్, పౌడర్ వంటివి రాయకూడదు. **- పెద్దాపురం**

వసంత విలాసి.. దేవులపల్లి

● **సాహిత్యంలో ఆయనకు ఆయనే సాటి..**

● **నవంబరు 1న జయంతి సందర్భంగా..**



దేవులపల్లి కృష్ణశాస్త్రి

ఆకులో ఆకునై.. కొమ్మలో కొమ్మనై.. నునులేతరెమ్మనై ఈ అడవి సాగిపోనా.. ఎటులైనా ఇచటనే ఆగిపోనా.. అంటూ తన భావ కవితా పటిమతో ప్రకృతి సౌందర్యాన్ని ప్రవచిస్తూ.. వాటికోసమే అహరహం పరితపించిన కవి దేవులపల్లి కృష్ణశాస్త్రి.. వసంత విలాసిగా ఆయన చిరస్మరణీయుడు. కాకినాడ జిల్లాలో పుట్టిన ఆయన తన రచనలతో పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్నారు. సినీ సాహిత్యంలోనూ తనదైన ముద్రవేశారు. మూడు దశాబ్దాలపాటు సినీ రంగంలో దేవులపల్లి తన హవా కొనసాగించారు. ఆయన పాటలు కోయిల గానంలా హాయిగా సంధ్యా సమయంలో గోదావరి గాలిలా ఆహ్లాదకరంగా ఉంటాయి. అంతటి కమ్మని.. నెమ్మని రచనలతో తనకంటూ ఓ శైలిని రూపొందించుకున్న ఆయన సదా సాహిత్య స్మరణీయుడు. 1897 నవంబరు 1న సామర్లకోట మండలం రావువారి చంద్రంపాలెం గ్రామంలో జన్మించిన దేవులపల్లి కృష్ణశాస్త్రి తల్లిదండ్రులు దేవులపల్లి తమ్మన్నశాస్త్రి, సీతమ్మ. సాహిత్య రంగంలోనేగాక సినీ రచనల్లోను తన సాహిత్యాన్ని గుబాళించిన దేవులపల్లి ప్రముఖ రచయితల రచనలను తెలుగులోకి అనువదించి ఆంధ్రా షెల్లీగా ఎంతో పేరుగాంచారు. చిన్నతనం నుంచీ తండ్రి, పెదనాన్నల స్ఫూర్తితో సాహిత్యంపై మక్కువ పెంచుకున్నారు. ఆయన తన ప్రాథమిక విద్యను స్వగ్రామం రావువారిచంద్రంపాలెంలోను, ఉన్నత విద్యను దగ్గర్లోని పిఠాపురంలోను, డిగ్రీని 1918లో విజయనగరం డిగ్రీ కళాశాలలోను పూర్తిచేశారు.

భావకవితోద్యమ ప్రచారకుడిగా..

ప్రముఖ కవులు కూచి నరసింహారావు, రఘుపతి వెంకటరత్నంనాయుడు ప్రోత్సాహంతో దేవులపల్లి ఆంగ్ల సాహిత్యాన్ని అధ్యయనం చేసి బ్రహ్మసమాజంపట్ల ఆకర్షితులయ్యారు. ఆంగ్ల సాహిత్యం, వంగ సాహిత్యంపట్ల కూడా బాగా ఆకర్షితులయ్యారు. ఈ ప్రభావంతోనే కృష్ణపక్షం సంపుటిని రాశారు. 1920 నుంచి 1935 వరకూ ఆయన చాలామందిపై ప్రభావం చూపారు. 1922లో భార్యా వియోగంతో కన్నీరు అనే ఖండకావ్యం, ఊర్వశి, ప్రవాహం రాశారు. పెద్దాపురం లూథరన్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరిన కృష్ణశాస్త్రి సంస్కరణోద్యమం, బ్రహ్మసమాజం, నవ్య సాహితీ సభ్యులుగా భావకవితోద్యమ ప్రచారకుడిగా దేశమంతా పర్యటించారు. కృష్ణశాస్త్రి స్త్రీ, హరిజనోద్ధరణ కార్యక్రమాలు చేపట్టారు. 1933-1941 మధ్యకాలంలో కాకినాడ పీఆర్ కళాశాలలో ఉపన్యాసకుడిగా పనిచేశారు.

సినీరంగ ప్రవేశం

1942లో చలనచిత్ర పరిశ్రమలో చిత్ర నిర్మాత బీఎన్‌రెడ్డి ప్రోత్సాహంతో దేవులపల్లి చిత్రసీమలో అడుగుపెట్టారు. అప్పటికే ఆయనకు 1929లో రవీంద్రనాథ్ ఠాగూర్‌తో సాన్నిహిత్య సంబంధాలు ఏర్పడ్డాయి. 1951లో మల్లీశ్వరి చిత్రంలో ఆయన రాసిన ప్రతి పాటకూ ప్రత్యేక స్థానాన్ని కల్పించాయి. మొత్తం 25 సినిమాలకు ఆయన పాటల రచయితగా 170 పాటలు రచించారు. ఆకాశవీధిలో హాయిగా ఎగిరేవూ, మనసున మల్లెలు మాలలూగెనే వంటి గీతాల పునాదులపై ఆయన చిత్రజీవితం పాటలా సాగింది. దేవులపల్లి సుకుమార.. సుందర.. సుమధుర.. లలిత.. మనోహర భావాలతో సినీ సామ్రాజ్యాన్ని ఏలారు. 1945 నుంచి హైదరాబాద్ ఆకాశవాణిలో గేయాలు, బాలగేయాలు, కార్మిక గీతాలు, భక్తిగీతాలు అశేష సంఖ్యలో రచించారు. దేవులపల్లి రచించిన గోదాకళ్యాణం, ధనుర్దాసు, వేణుం కుంజా, వసంతోత్సవం నాటకాలు ఎంతో ప్రసిద్ధి.

సొంతిల్లు పాఠశాలకు..

దేవులపల్లి తన జన్మస్థలం రావువారిచంద్రంపాలెంలో అందరినీ విద్యావంతులను చేయాలన్న ప్రగాఢ కాంక్షతో తన సొంతింటిని పాఠశాల నిర్వహణకు ప్రభుత్వానికి ఉచితంగా ఇచ్చారు. ఆయన ఇంటి ఆవరణలోనే ఇప్పటికీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నిర్వహిస్తుండడం గర్వకారణం. ఈ ఇంటి ఆవరణలో ఆయన అభిమానులు నిలువెత్తు దేవులపల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయగా 2004లో అప్పటి కలెక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి ఆవిష్కరించారు. దేవులపల్లి చివరిరోజుల్లో సైతం గోరింట పూచింది.. కొమ్మలేకుండా తెలుగుపాటకు అందం దిద్దారు. దేవులపల్లి రాసిన జయ జయ ప్రియ భారత జనయిత్రీ దివ్యధాత్రీ.. అనే గీతం జాతీయ గీతం అన్ని అర్హతలు ఉన్న గీతంగా గుర్తింపు పొందింది. ఆంధ్రా విశ్వవిద్యాలయం కళాప్రపూర్ణతోనూ, కేంద్ర ప్రభుత్వం పద్మవిభూషణ్‌తోనూ దేవులపల్లిని సత్కరించాయి. 1966లో ఆయన కంఠం మూగబోయింది. అయినప్పటికీ తన రచనలు కొనసాగించారు. 1980 ఫిబ్రవరి 24న ఆయన తుదిశ్వాస విడిచారు. దేవులపల్లి మరణించి నేటికి 44ఏళ్లు కావస్తున్నా ప్రభుత్వం సరైన రీతిలో గుర్తించకపోడం విచారకరం. ఈ ప్రాంతానికి శాసనసభ్యుడిగా ఉన్న ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ హయాంలోనైనా ప్రభుత్వం తరపున కృష్ణశాస్త్రికి, స్వగ్రామం రావువారిచంద్రంపాలేనికి తగిన గుర్తింపు ఇస్తారని ప్రజలు ఆశిస్తున్నారు. **- ఆంధ్రజ్యోతి/సామర్లకోట**











తణుకు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పేదల జీవితాలపై పిడుగు

- బాణసంచా తయారీ కేంద్రంపై పిడుగు పడి భారీ విస్ఫోటనం
- ఇద్దరి మృతి.. ఐదుగురికి తీవ్రగాయాలు.. తణుకు, ఏలూరు ఆసుపత్రిలకు తరలింపు
- పొలాల్లోకి పారిపోయి ప్రాణాలు దక్కించుకున్న తొమ్మిది మంది కార్మికులు
- హాహాకారాలతో దద్దరిల్లిన ఘటనా స్థలం.. ఆస్పత్రి ప్రాంగణం
- తూ.గో.జిల్లా ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెంలో ఘటన..
- మృతులది వెంకట్రాయపురం, రావిపాడు

ఉండ్రాజవరం/తణుకు/పెంటపాడు అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వారంతా రోజు కూలీలు. పనికి వెళితే తప్ప పూట గడవని కుటుంబాలు. దీపావళి వేళ.. అందరి ఇళ్లల్లోనూ వెలుగులు పంచాలనుకున్నారు. కాని, వారి కుటుంబాలపై పిడుగు పడి.. చీకట్లు అలుముకున్నాయి. తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెంలో దీపావళి మందులు తయారీ చేసే షెడ్డు పక్కన వున్న కొబ్బరి చెట్టుపై బుధవారం సాయంత్రం పిడుగు పడింది. పక్కనే ఈ షెడ్డులో కార్మికులు చిచ్చుబుడ్లు, తారాజువ్వలు తయారు చేస్తున్నారు. ఈ పిడుగు కారణంగా ఇక్కడ భారీ విస్ఫోటనం సంభవించి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఓ వైపు పిడుగుపాటు శబ్దం, మరోవైపు బాణసంచా పేలుడుతో అసలు అక్కడ ఏం జరుగుతుందో తెలుసుకునేలోగా ఇద్దరు మహిళలు కాలి బూడిదయ్యారు. మరో ఐదుగురి కాలిన గాయాలతో హాహాకారాలు చేస్తూ బయటకు పరుగులు తీశారు. అక్కడే పనిచేస్తున్న మరో తొమ్మిది మంది వెంటనే తేరుకుని ప్రాణాలు దక్కించుకునేందుకు పక్కనే వున్న పంట పొలాల్లోకి పరుగులు తీశారు. ప్రమాదంలో బాణసంచా తయారు చేస్తున్న పెంటపాడు మండలం రావిపాడుకు చెందిన కార్మికురాలు గుమ్మడి సునీత(38), బాణసంచా తయారీ యజమాని భార్య, తణుకు మండలం వెంకట్రాయపురానికి చెందిన వేగరోతు శ్రీవల్లి(35) అక్కడక్కడే మరణించారు. దువ్వకు చెందిన కడిమి కుమారి, చుక్కా పెద్దింట్లు, పెంటపాడు మండలం రావిపాడుకు చెందిన మందలంక కమలరత్నం, సీలం లక్ష్మీ, జంగారెడ్డిగూడెంకు చెందిన విప్పర్తి వెంకటేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డారు. ఘటనా స్థలానికి వచ్చిన గ్రామస్తులు వీరిని రక్షించే ప్రయత్నం చేశారు. కాలిన గాయాలతో బాధితులు హాహాకారాలు చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే సుమారు గంటపాటు వర్షం పడటంతో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించేందుకు ఇబ్బంది కలిగింది. ఈలోగా తహసిల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఎస్ఐ గుబ్బల శ్రీనివాసరావు, సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన ఐదుగురిని ఎస్సై గుబ్బల శ్రీనివాసరావు తన జీపులో తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోదనలతో ఆసుపత్రి ప్రాంగణం

క్షతగాత్రులను తణుకు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. క్షతగాత్రుల హాహాకారాలు, వారి బంధువుల రోదనలతో ఈ ప్రాంగణం మిన్నంటింది. వీటి మధ్యే వైద్యులు చికిత్స అందించారు. క్షతగాత్రులను తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, నిడదవోలు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పరామర్శించారు. ఆసుపత్రి సూప రింటెండెంట్ డాక్టర్ వి.అరుణతో ఆరిమిల్లి మాట్లాడారు. అనంతరం కలెక్టర్ నాగరాణికి ఫోన్ చేసి విషయం వివరించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. బాధితులను ఆదుకుంటామన్నారు.

పొట్టకూటి కోసం వచ్చిన వారే

బాణసంచా తయారీకి వచ్చిన వారంతా నిరుపేదలే. పొట్టకూటి కోసం వచ్చిన వారే. కొందరు నెల, మరికొందరు రెండు నెలలుగా పని చేస్తున్నారు. పెంటపాడు మండలం రావిపాడుకు చెందిన గుమ్మడి సునీత(38), మందలంక కమల రత్నం, శీలం లక్ష్మి కొద్ది రోజులుగా రోజూ పనికి వెళ్లి వస్తూ వుంటారు. సునీతకు భర్త శ్రీను, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కమలరత్నంకు భర్త వెంకట్రావు, ఇద్దరు కుమారులు ఉండగా, లక్ష్మీకి భర్త దుర్గారావు కుమార్తె ఉన్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బాణసంచా తయారీ నిర్వాహకుడు శివకు వ్యాపారంలో తోడుగా ఉండేందుకు ఆయన భార్య శ్రీవల్లి పది రోజులుగా అక్కడకు వెళుతోంది. వీరికి కుమార్తె, కుమారుడు. కుమార్తెకు వివాహమైంది.



పిడుగు పడడంతో దగ్ధమైన కొబ్బరి చెట్టు

జేసీ ఘటనా స్థలం పరిశీలన

తణుకు మండలం వెంకట్రాయపురానికి చెందిన రామ్‌శివాజీ రెండేళ్లుగా చిచ్చుబుడ్డీలు, తారాజువ్వలు తయారు చేస్తున్నాడు. ప్రమాదం జరిగిన సమయంలో 16 మంది బాణసంచా తయారు చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని జేసీ చినరాముడు, ఆర్డీవో రాణిసుస్మిత పరిశీలించారు. రామ్‌శివాజీతో మాట్లాడి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ పనిచేసే వారంతా పేదలేనని, జీవనోపాధి కోసం దూర ప్రాంతం నుంచి ఇక్కడకు 18 మంది వచ్చి చిరు జీతానికి పనిచేస్తున్నారని చెప్పారు. కార్మికులందరికి ఇన్సూరెన్స్ చేయించినట్లు తెలిపారు. ఈ రోజు 16 మంది మాత్రమే పనిచేస్తున్నారని తెలిపారు. మృత్యువు పిడుగు రూపంలో వచ్చి తన భార్య శ్రీవల్లి, మరో మహిళను కోల్పోయామని కన్నీటి పర్యంతమయ్యారు. ప్రమాదంలో ఇద్దరు మహిళలు మరణించడం బాధాకరమని జేసీ చెప్పారు. మృతులకు ప్రభుత్వ సహాయ సహకారాలందేలా చర్యలు తీసుకుంటామన్నారు. మంత్రి కందుల దుర్గేష్ మృతుల కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.



క్షతగాత్రులను పరామర్శించి వివరాలు తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే శేషారావు



అగ్ని ప్రమాదంలో దగ్ధమైన మందుగుండు సామగ్రి



తీవ్ర గాయాలతో బాధపడుతున్న మహిళ



టీటీడీ బోర్డు సభ్యుడిగా ఎంపికైన నెహ్రూకు స్వీట్ తినిపిస్తున్న భార్య మణమ్మ

టీటీడీ బోర్డు సభ్యుడిగా
జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యుడి గా ఎంపికయ్యారు. ఈమేరకు మంగళగిరి నుం చి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా నుంచి ఇద్దరిని ఎంపిక చేయగా వీరిలో నెహ్రూ ఒకరు. ఆయన ఎంపిక పట్ల టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కొన్నేళ్ల నుంచి జ్యోతుల నెహ్రూ ఆధ్యాత్మికం వైపు నడుస్తూ దేశంలో ఉన్న అనేక శివ, వైష్ణవ క్షేత్రాలతోపాటు అష్టాదశ శక్తి పీఠాలను దర్శించుకోవడంతోపాటు కలియుగ దైవం వెంకటేశ్వరస్వామి ఆలయానికి అనేకసార్లు వెళ్లి దర్శించుకున్నారు. తన స్వగ్రామం జగ్గంపేట మండలం ఇర్రిపాకలో అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. ఇటీవల ఎన్నికల్లో నెహ్రూ నాలుగోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యా రు. కాగా, కాకినాడ జిల్లాకు సంబంధించి గతంలో కాకినాడ రూరల్ నియోజకవర్గం నుంచి అప్పటి ఎమ్మెల్యేగా ఉన్న పిల్లి అనంతలక్ష్మికి టీటీడీ బోర్డు సభ్యురాలి పదవి వరించింది. ప్రస్తుతం జ్యోతుల నెహ్రూకు టీటీడీ బోర్డు సభ్యుడి పదవి ఇవ్వడంపట్ల ఆయన ఇంట సందడి నెలకొంది. స్థానికంగా ఉన్న పోలీసులు, నేతలు ఆయన్ను కలిసి అభినందిస్తున్నారు. నెహ్రూ సతీమణి మణమ్మ ఆయనకు స్వీట్ తినిపించి ఆనందం పంచుకున్నారు.

టీటీడీ బోర్డు మెంబర్‌గా
అక్కిన ముని కోటేశ్వరరావు

● **రాజమహేంద్రవరానికి చోటు**



రాజమహేంద్రవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ బోర్డు మెంబర్‌గా రాజమహేంద్రవరం నగరానికి చెందిన అక్కిన ముని కోటేశ్వరరావు నియమితులయ్యారు. కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవులలో భాగంగా టీటీడీ బోర్డు పాలకవర్గాన్ని బుధవారం ప్రకటించిన సంగతి తెలిసిందే. అందులో రాజమహేంద్రవరానికి కూడా గౌరవం దక్కింది. ముని కోటేశ్వరరావు స్వగ్రామం సీతానగరం మండలంలోని రఘుదేవపురం. కాంట్రాక్టర్‌గా ఎదిగారు. కానీ రాజమ హేంద్రవరంలోనే నివాసం. రాజకీయాలకు అతీతంగా అందరితో సన్నిహితంగా ఉంటే ముని కోటేశ్వరరావు ప్రజాసేవలో కూడా ముందుంటారు. సీతానగరం మండలంలో రాజంపేటలో మంచినీటి సౌకర్యం ఏర్పాటుచేసి మునికూడలి, వెదుళ్లపల్లి గ్రామాలకు కూడా ఉపయోగపడేటట్టు చేశారు. రఘుదేవపురంలో కూడా మంచినీటి సౌకర్యం కల్పించారు. వేంకటేశ్వరస్వామి, పద్మావతి ఆలయాలు కూడా నిర్మించారు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ వేంకటేశ్వరస్వామివారికి సేవచేసే భాగ్యం లభించడంసంతోషాన్ని కలిగించిందని చెప్పారు.

● **గోరంట్ల అభినందనలు**

టీడీపీ బోర్డు చైర్మన్‌గా నియమితులైన నాయుడు, సభ్యులుగా నియమితులైన జ్యోతుల నెహ్రూ, అక్కిన ముని కోటేశ్వరరావుకు టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అభినందనలు తెలిపారు. స్వామికి సేవ చేసే అవకాశం వారికి లభించడం సంతోషకరమన్నారు.


వెండి పాదుకలు సమర్పిస్తున్న దాతలు

తలుపులమ్మ అమ్మవారికి వెండి పాదుకల సమర్పణ

తుని రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలం లోవ క్షేత్రంలో వేంచేసియున్న తలుపులమ్మ అమ్మవారికి గుంటూరుకు చెందిన ఆలూరి అనూరాధ-శశిధర్ దంపతులు సుమారు రూ.1.30 లక్షలు విలువ చేసే మూడు వెండి పాదుకలను తయారు చేయించారు. బుధవారం ప్రత్యేక పూజల అనంతరం వీటిని ఆలయ అధికారులకు అందజేసి అమ్మవారి పూజకు వినియోగించాలని కోరారు. దాతలను వేద పండితులు శేషవస్త్రాలతో సత్కరించి అమ్మవారి మహాప్రసాదం అందజేశారు.




హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

సత్యదేవుని హుండీల ఆదాయం రూ.1.22 కోట్లు

అన్నవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అన్నవరం సత్యదేవుని సన్నిధిలో భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. రూ.1,22,41,967 నగదు, 10.5 గ్రాముల బంగారం, 410 గ్రాముల వెండి లభించాయి. 117 యుఎస్ఏ డాలర్లు, 220 కెనడా డాలర్లు, 50 ఆస్ట్రేలియా డాలర్లు, 105 యుఏఈ దిరహమ్స్, 100 యూరోలు, సెంట్రల్ బ్యాంక్ ఖతర్ 109 రియల్స్ భక్తులు సమర్పించుకున్నారు. 30 రోజులకు ఈ ఆదాయం వచ్చింది. లెక్కింపును ఈవో రామచంద్రమోహన్, చైర్మన్ రోహిత్ పర్యవేక్షించగా సిబ్బంది పాల్గొన్నారు.


కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది, సేవాదళ్ సభ్యులు

బాలబాలాజీ హుండీల ఆదాయం
రూ.35 లక్షలు

మామిడికుదురు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీస్వామి ఆలయంలో హుండీలను బుధవారం తెరిచి లెక్కించారు. 98 రోజులకు ఆలయ ప్రధాన హుండీల ద్వారా రూ.35,00,622, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.52,096, 8 గ్రాముల బంగారం, .120 గ్రాముల వెండి లభించిందని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. గ్రేడ్-1 కార్యనిర్వహణాధికారి రాగోలు శ్రీనివాస్ ప్రత్యేకాధికారిగా హాజరయ్యారు. దేవస్థానం సిబ్బంది, శ్రీవారి సేవకులు, బ్యాంక్ ఆఫ్ బరోడా సిబ్బంది, స్థానికులు లెక్కింపులో పాల్గొన్నారు.



ఏఎస్పీ ఎదుట లొంగిపోయిన సుక్కి

మావోయిస్టు దళ సభ్యురాలు
లొంగుబాటు

చింతూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ దళ సభ్యురాలు సోడి సుక్కి బుధవారం చింతూరు పోలీసుల ఎదుట లొంగిపోయింది. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరులోని తన కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను ఏఎస్పీ పంకజ్ కుమార్‌మీనా వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా చింతగుప్ప పోలీసు స్టేషన్ పరిధిలోని దులోడ్ గ్రామానికి చెందిన సుక్కి మూడేళ్ల క్రితం మావోయిస్టు పార్టీలో చేరింది. పార్టీ అప్పజెప్పిన బాధ్యతల్లో భాగంగా టైలరింగ్ టీంలో పని చేసింది. అనంతరం ఆమెకు శిక్షణ ఇచ్చి పదోన్నతి కల్పించి అగ్రికల్చర్ టీంకు బదిలీ చేసింది. 2023లో మెట్టగూడెం అటవీ ప్రాంతంలో పోలీసులు, మావోయిస్టుల నడుమ జరిగిన కాల్పుల్లో సుక్కి పాల్గొంది. మావోయిస్టు పార్టీలో ప్రస్తుతం చోటుచేసుకుంటున్న పలు విధానాలకు విసుగు చెందడంతో పాటు పోలీసులు చేపడుతున్న పరివర్తన కార్యక్రమంలో భాగంగా సుక్కి పోలీసుల ఎదుట లొంగిపోయింది. కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ పి.దివాకర్, సీఐ దుర్గాప్రసాద్, ఎస్ఐ పి.రమేష్ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో నలుగురు యువకులు!

మహిళ అనుమానాస్పద మృతి కేసు

కడియం, అక్టోబరు 30: మహిళ అదృశ్యమై అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన కేసులో నలుగురు అనుమానిత యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం బుర్రిలంక గ్రామానికి చెందిన రైతు కస్తూరి (43) ఈ నెల 15న అదృశ్యమైంది. దీనిపై ఆ మర్నాడు భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. 17న కస్తూరి మృతదేహం చొప్పెల్ల లాకుల వద్ద లభ్యమైంది. ఆమెకు గుండుకొట్టి ఉండడంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో నలుగురు యువకులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్టు తెలిసింది.


కస్తూరి (పాత చిత్రం)


నన్నయ విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం ఎదుట ధర్నా చేస్తున్న బాలికల వసతిగృహం విద్యార్థినులు

ఈ భోజనం మాకొద్దు

- అన్నంలో పురుగులు
- సరిగా ఉడకని కూరలు..
- తాగునీరు అంతంతమాత్రం
- పెరుగు సైతం బాగోట్లేదు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని వర్శిటీ అధికారులు
- నాలుగు రోజులుగా భోజనం తినలేదు
- నన్నయ యూనివర్శిటీ బాలికల వసతిగృహం విద్యార్థినుల ధర్నా
- సమస్యల పరిష్కారానికి కమిటీలు వేయాలి: ఎమ్మెల్యే బత్తుల

దివాన్‌చెరువు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): బాలికల వసతిగృహంలో పురుగులతో, మాడిన పదార్థాలతో పెడుతున్న భోజనం చేయలేకపోతున్నామని, మంచి భోజనం అందించాలని డిమాండ్ చేస్తూ ఆది కవి నన్నయ విశ్వవిద్యాలయంలోని బాలికల వసతిగృహం విద్యార్థినులు బుధవారం ధర్నా చేశారు. వన్ వాయిస్, వన్ డిమాండ్, గుడ్‌ఫుడ్ అన్న ప్లకార్డులను ప్రదర్శిస్తూ మండుటెండలో విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించారు. ఉదయం సుమారు 9:30 గంటలకు ఆందోళన చేపట్టడంతో వర్శిటీ లోపలికి వెళ్లేందుకు ఉద్యోగులకు వీలు లేకుండా పోయింది. కొంతమంది గేటు బయటే ఉండిపోయారు. సమాచారం తెలుసుకున్న రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ యూనివర్శిటీ వద్దకు చేరుకున్నారు. వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ సమక్షంలో విద్యార్థులతో మాట్లాడారు. ఆందోళన విరమించి సమస్యలను వివరించాలని, ఇరువర్గాలతో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. దీంతో విద్యార్థినులు 11 గంటల ప్రాంతంలో ఆందోళన విరమించారు.

అనంతరం ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్లో విద్యార్థులు, వర్శిటీ అధికారులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. విద్యార్థినులు మాట్లాడుతూ విశ్వవిద్యాలయం మహిళా వసతి గృహంలో సరైన నీటి సదుపాయం లేదని, పరిశుభ్రత లేదని, అన్నం, కూరలు, పెరుగు సైతం బాగోట్లేదన్నారు. తినే అన్నంలో పురుగులు వస్తున్నాయని, భోజనం సరిగా వండట్లేదని ఏకరువు పెట్టారు. రాత్రిళ్లు అనారోగ్యం వస్తే వైద్యం చేసేందుకు యూనివర్శిటీలో కనీసం ఒక నర్సు కూడా అందుబాటులో ఉండట్లేదని వాపోయారు. తినడానికి వీల్లేకుండా ఉన్న ఆహారాన్ని ఈ నెల 23న తీసుకువెళ్లి వీసీకి చూపించామని, ఆయన తమకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారన్నారు. నాలుగు రోజులుగా తిండి కూడా తినలేదని వాపోయారు. ఈ సమస్యలను తాము విశ్వవిద్యాలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరించకపోగా వార్డెన్ తమతో బెదిరింపు ధోరణిలో మాట్లాడుతున్నారన్నారు. బాలుర హాస్టల్ కంటే ప్రతినెలా తామే ఎక్కువ సొమ్ము చెల్లిస్తున్నామని విద్యార్థినులు చెప్పారు. వంట వారిలో సీనియర్ సిటిజన్లు ఎక్కువ ఉన్నారన్నారు.

యూనివర్శిటీలోని బాలికల వసతిగృహంలో సమస్యలను పరిష్కరించేందుకు విద్యార్థినులు, వర్శిటీ అధికారులతో రెండు కమిటీలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. హాస్టల్ విద్యార్థినుల సంక్షేమానికి కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. విశ్వవిద్యాలయంలో 24 గంటలూ విద్యార్థినులకు ఒక నర్సు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడతామన్నారు. రాత్రిళ్లు పెట్రోలింగ్ చేయాలని పోలీసులకు తెలిపామన్నారు. తాను వారానికి ఒకసారి యూనివర్శిటీ హాస్టల్‌ను సందర్శిస్తానన్నారు. విశ్వవిద్యాలయంలో పరిశుభ్రత తదితర అంశాలపై రిజిస్ట్రార్ సుధాకర్‌కు ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ కమిటీలను వేస్తామని, కుక్‌ను మార్చాలన్న ప్రధాన డిమాండ్‌పై వీసీతో చర్చిస్తామన్నారు. సమావేశంలో వర్శిటీ అధికారులు డి.జ్యోతిర్మయి, ఎన్.ఉదయభాస్కర్ ప్రిన్సిపాల్స్ కె.సుబ్బారావు, పి.వెంకటేశ్వరరావు, రాజానగరం సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్, ఏబీవీపీ విభాగ్ కన్వీనర్ సత్యసాయి, జనసేన నాయకులు దేశాల శ్రీను, గల్లా రంగా, వై.శ్రీను పాల్గొన్నారు.


విద్యార్థినులు, విశ్వవిద్యాలయ అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ



మరణించిన లేగ దూడ, దుక్కుటెద్దు

మన్యం పులి గర్జన

కూనవరం మండలంలో ఒకే రోజు రెండు పశువులను చంపిన వైనం

కూనవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మన్యంలో పెద్ద పులి గర్జించింది. ఒకేరోజు రెండు పశువులను చంపి అటు ప్రజలను, ఇటు అధికారులను భయభ్రాంతులకు గురిచేసింది. కూనవరం మండలం బోదునూరు అడవిలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఒకేరోజు రెండు గంటల వ్యవధిలో రెండు పశువులను చంపడంతో గిరిజనులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.

కళ్లెదుటే పశువులను చంపిన పులి

సాధారణంగా గిరిజనులు తమ పశువులను రాత్రివేళ ఊరు శివారున ఉన్న అడవుల్లో కట్టేస్తారు. చుట్టూరా తడికెలు పెట్టి పశువులను అందులో ఉంచుతారు. బోదునూరుకు చెందిన సోడే శ్రీను కుమారుడు విష్ణు బుధవారం యథావిధిగా పశువులను మేపడానికి వెళ్లాడు. పాక దగ్గరకు వెళ్లి పశువుల తాడు విప్పే ప్రయత్నం చేశాడు. ఒక పశువు పాకకు దూరంగా ఉండడంతో దాని దగ్గరకు వెళ్లి లేపే ప్రయత్నం చేశాడు. ఇంతలో దగ్గర్లోని పొదలో దాగివున్న పులి ఒక్కసారిగా గర్జించి పైకి లేచింది. దీంతో విష్ణు అక్కడి నుంచి పరుగులు తీశాడు. ఇంతలో పులి ఆ పశువును కొంత దూరం లాక్కుని వెళ్లి అక్కడ ఉన్న నీళ్లలో వదిలేసింది. దీనిని దూరం నుంచి గమనించిన విష్ణు ఒక్కసారిగా ఊళ్లోకి పరుగు తీసి తండ్రితో పాటు గ్రామ పెద్దలకు విషయం తెలపగా వారు అటవీ శాఖాధికారులకు సమాచారమిచ్చారు. అటవీ శాఖాధికారులు సంఘటనాస్థలానికి చేరుకుని పశు వైద్యులతో పోస్టుమార్టం నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన తుష్టి జోగయ్య పశువులను తోలుకుని అడవిలోకి వెళ్లాడు. మొదటి సంఘటన జరిగిన గంట వ్యవధిలోనే పులి మరోసారి అక్కడున్న పశువుల మందపై దాడి చేసింది. లేగ దూడ తలపైకి దూకి చంపివేసింది. దీనిని ప్రత్యక్షంగా చూసిన జోగయ్య అక్కడి నుంచి భయంతో పరుగులు పెట్టాడు. అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పూర్తి వివరాలు సేకరించారు. చనిపోయిన పశువులకు ఎక్స్‌గ్రేషియా ఇస్తామన్నారు.


పులి పశువును చంపుతుండగా ప్రత్యక్షంగా చూసిన జోగయ్య

పులి సమాచారం ఇచ్చిన గిరిజన బాలుడికి
చాక్లెట్ ఇచ్చి అభినందించిన డీఎఫ్‌వో



తొలి సంఘటనా స్థలానికి డీఎఫ్‌వో బబిత చేరుకున్నారు. పులి సమాచారాన్ని ధైర్యంగా చెప్పి ప్రజల ద్వారా అటవీ శాఖాధికారులకు సమాచారం తెలియజేసిన గిరిజన బాలుడు సోడే విష్ణును ఆమె అభినందించారు. అతడి ధైర్యానికి మెచ్చుకుని చాక్లెట్ ఇచ్చారు. పులి కనిపిస్తే ప్రతి ఒక్కరూ ఇలా అధికారులకు తెలియజేయాలన్నారు. గ్రామాల్లోకి వచ్చిన పులిని సురక్షితంగా దట్టమైన అటవీ మార్గంలోకి పంపించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అధికారులు పులి జాడ కోసం రాత్రివేళలో సైతం ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఇందుకు ఒక కమిటీ వేశామన్నారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, రాత్రివేళ బయటకు రావొద్దని సూచించారు.

లక్ష్మీపురం పీహెచ్‌సీలో వ్యక్తి వీరంగం

ఎటపాక, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపురం పీహెచ్‌సీ వెనుక నివాసముండే ఓ వ్యక్తి మంగళవారం రాత్రి వీరంగం సృష్టించాడు. రాత్రి 11 గంటల సమయంలో పీహెచ్‌సీలోకి వచ్చి రాత్రి వేళ తలుపులు ఎందుకు క్లోజ్ చేస్తున్నారని, 24 గంటల డ్యూటీలో ఉండే సిబ్బంది స్పందించట్లేదని వైద్య సిబ్బందిపై చిందులు తొక్కాడు. ఆ సమయంలో డ్యూటీలో ఉన్న స్టాఫ్ నర్సు సీత, వాచ్‌మన్ వారిస్తున్నా పట్టించుకోకుండా చిర్రెత్తిపోయాడు. ఆసుపత్రి ప్రవేశ తలుపులను పదేపదే గోడకేసి గట్టిగా కొడుతూ ధ్వంసం చేశాడు. పక్కనే ఉన్న బీపీ, వేయింగ్ మిషన్లను కూడా ధ్వంసం చేశాడు. సుమారు గంటసేపు హల్‌చల్ చేశాడు. సదరు వ్యక్తి మద్యం మత్తులో ఈ ఘటనకు పాల్పడినట్టు తెలుస్తోంది. విధుల్లో ఉన్న స్టాఫ్ నర్సు సీత, వాచ్‌మన్‌లను భయభ్రాంతులకు గురిచేశాడు. కొందరు ఎంత నచ్చజెప్పినా వినకుండా దౌర్జన్యంగా సామగ్రిని పగలగొట్టాడు. ఈ ఘటనపై వైద్య సిబ్బంది బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం.



సరస్వతి, స్వాతి (పాత చిత్రాలు)

మానసిక స్థితి సరిగా లేకే!

- తల్లీ, కూతుళ్ల ఆత్మహత్య ఘటనలో వెలుగులోకి మరిన్ని విషయాలు
- వివాహ విషయంలో తలెత్తిన వివాదం
- తండ్రి కలలోకి వచ్చి తన దగ్గరకు వచ్చేయమన్నాడంటూ ఇటీవల బావకు ఫోన్

కాకినాడ క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కారణాలతో తీవ్ర మనస్తాపానికి గురైన తల్లీకూతుళ్లు కాకినాడలో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తెలిసిందే. వారిద్దరి మృతదేహాలకు జీజీహెచ్ మార్చురీలో బుధవారం పోస్టుమార్టం పూర్తయింది. కాకినాడ వార్ఫు రోడ్డులోని పెంకే వారి వీధి వాసవీ కల్యాణ మండపం సమీపంలోని ఓ ఇంట్లో ఆకాశం సరస్వతి (60), ఆకాశం స్వాతి (28) ఉంటున్నారు. స్వాతి పెళ్లి విషయంలో వివాదం తలెత్తి ఇద్దరూ ఆత్మహత్య చేసుకున్నారు. సరస్వతి భర్త నరసింహరావు 15ఏళ్ల క్రితం మరణించాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె హారిక లక్ష్మీ దుర్గాప్రభ వివాహమై భర్త సత్యభాస్కర్‌తో కలిసి విశాఖపట్నంలో ఉంటోంది. చిన్న కుమార్తె స్వాతి టైలరింగ్ చేస్తూ ఇంటి వద్దే ఉంటోంది. తల్లి, చిన్న కూతురు మానసిక పరిస్థితి కొన్నాళ్లుగా సరిగా లేదని భావిస్తున్నారు. ఇటీవల తండ్రి కలలోకి వచ్చి తన వద్దకు వచ్చేయమని అన్నట్టుగా స్వాతి భావించింది. ఇటీవల తన బావ సత్యభాస్కర్‌కు ఫోన్ చేసి తన తండ్రి పేరున జ్ఞాపకార్థంగా భోజనాలు పెట్టాలని చెప్పింది. ఇందుకుగాను అతడు స్వాతికి రూ.20వేలు ఫోన్ పే చేశాడు. ఆమె రూ.13వేలు వెనక్కి పంపింది. రేపటికి అమ్మ, నేను ఈ భూమ్మీద ఉండమని అక్క హారికకు ఫోన్ చేసి చెప్పింది. ఈ నేపథ్యంలో తర్వాతి రోజే తల్లీకూతుళ్లు ఆత్మహత్యకు పాల్పడ్డారు. కానీ ఈ విషయం ఎవరికీ తెలియలేదు. మంగళవారం ఇంటి నుంచి దుర్వాసన వస్తుండడంతో యజమాని గుర్రాల శ్రీనివాస్ గమనించి కిటికీలను తెరిచి చూడగా తల్లీకూతుళ్లు విగతజీవులుగా చీరలకు వేలాడుతూ కనిపించారు. అతడి ఫిర్యాదు మేరకు వన్ టౌన్ సీఐ ఎం.నాగదుర్గారావు కేసు నమోదు చేసి సంఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించి పోస్ట్‌మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. బుధవారం ఫోరెన్సిక్ వైద్యులు పోస్ట్‌మార్టం పూర్తి చేసి బంధువులకు అప్పగించారు. కాకినాడ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెల్లూరు సర్వారాయ షుగర్స్ డిస్టిలరీలో సీఐడీ సోదాలు

రాయవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్త తనిఖీల్లో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం చెల్లూరు సర్వారాయ షుగర్స్‌లోని డిస్టిలరీ యూనిట్‌లో సీఐడీ అధికారులు బుధవారం తనిఖీలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సోదాలు జరిపారు. రికార్డులు, స్టాక్‌ను పరిశీలించినట్టు తెలిసింది. తనిఖీల సమయంలో ఎవరినీ లోపలికి అనుమతించలేదు. అధికారులు ఎటువంటి వివరాలు వెల్లడించలేదు.

అయ్యప్ప భక్తుడిపై నీటి పిల్లి దాడి



ఆలమూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు వద్ద కోరంగి ప్రధాన కాలువలో స్నానానికి దిగిన ఆలమూరుకు చెందిన అయ్యప్ప భక్తుడు సి.విజయ్‌కుమార్‌పై నీటి పిల్లి దాడి చేసింది. చేతి మీద, కాలు మీద గాయపరిచింది. ఆయన ఆలమూరు సీహెచ్‌సీలో వైద్య సాయం పొందారు. దాడి చేసినట్టు భావిస్తున్న నీటి పిల్లి చిత్రాన్ని ఆయన గూగుల్‌లో చూపించారు. కాగా ఈ విషయం చర్చనీయాంశమైంది. నీటి పిల్లి దాడిలో గాయపడితే రేబిస్ వ్యాక్సిన్ వేయించుకోవాలని వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎల్.అనిత తెలిపారు. నీటి పిల్లులు గోదావరి, ప్రధాన కాలువల్లో సంచరిస్తుంటాయని, ఇవి ఎవరిపైనా దాడి చేయవన్నారు.


గాయపడిన విజయ్ కుమార్

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి గెలుపే ధ్యేయం

ఎమ్మెల్సీ వేపాటి చిరంజీవి

సర్పవరం జంక్షన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరుగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ గెలుపే ధ్యేయంగా సమష్టిగా పని చేయాలని, తటస్థుల ఓట్లను నమోదు చేయించే బాధ్యతలను తీసుకోవాలని ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ వేపాటి చిరంజీవి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక బోట్‌క్లబ్ సమీపంలోగల కృషి భవన్‌లో కాకినాడరూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆధ్వర్యంలో ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదుపై కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలకు నిర్వహించిన అవగాహన సమావేశంలో టీడీపీ రూరల్ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, కూటమి నాయకులు కటకంశెట్టి బాబీ, పెంకే శ్రీనివాస బాబా, నులుకుర్తి వెంకటేశ్వరరావు, వాసిరెడ్డి ఏసుదాసు, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, బీజేపీ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు ప్రసంగించారు. ఎమ్మెల్సీ చిరంజీవి మాట్లాడుతూ ఓట్ల నమోదు చేయించాల్సిన బాధ్యత కూటమి నాయకులదేనన్నారు. బూత్‌స్థాయిలో ఎక్కడెక్కడక గ్రాడ్యుయేట్లు ఉన్నాయో కనుక్కోవడంతో పాటూ ఫారాలు తీసుకెళ్లి, వారి వద్ద నుంచి సర్టిఫికెట్లు తీసుకుని గెజిటెడ్‌తో సంతకం చేయించి అధికారులకు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో అత్యధిక ఓట్లు నమోదు చేయించి, రాజశేఖర్ విజయానికి శాయశక్తులా కృషి చేస్తానని ఎమ్మెల్యే నానాజీ తెలిపారు. ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్ మాట్లాడుతూ కాకినాడ రూరల్ నియోజకవర్గంలో టీడీపీ తరపున పని చేయడంతో రాష్ట్రస్థాయిలో తనకు గుర్తింపు వచ్చిందన్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.


సర్పవరం జంక్షన్: ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్‌కు సంఘీభావం తెలుపుతున్న కూటమి నేతలు

భారీ మెజార్టీతో గెలిపించాలి

తాళ్లరేవు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల ఉమ్మడి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు కోరారు. పి.మల్లవరం గొల్లబాబు కళ్యాణమండపంలో ఏర్పాటుచేసిన ఎమ్మెల్సీ ఓటర్ల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ముమ్మిడివరం నియోజకవర్గంలో పట్టుబద్రులను గుర్తించి ఓటరుగా నమోదుచేసే బాధ్యత జనసేన, టీడీపీ, బీజేపీ కార్యకర్తలు తీసుకోవాలన్నారు. ఉమ్మడి అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలన్నారు. ఎమ్మెల్సీ చిరంజీవి ఓటరు నమోదుపై కార్యకర్తలకు వివరించారు. పేరాబత్తుల రాజశేఖర్ మాట్లాడుతూ తన విజయానికి ఓట్లు వేయించేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో మాజీఎమ్మెల్యే చెల్లి వివేకానంద, అశోక్‌కుమార్, టేకుమూడి లక్ష్మణరావు, ధూళిపూడి వెంకటరమణ, మందాల గంగసూర్యనారాయణ, కట్టా త్రిమూర్తులు, కూటమి నాయకులు, కార్యకర్తలున్నారు.


పి.మల్లవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దాట్ల

'మందుల కంపెనీల దోపిడీను అరికట్టాలి'

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): బ్రాండ్ పేరుతో కార్పొరేటు ఫార్మాస్యూటికల్ మందుల కంపెనీల దోపిడీని అరికట్టాలని భారత విప్లవ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. వైద్యులు జనరిక్ పేరుతో ప్రిస్క్రిప్షన్ రాయాలన్న మెడికల్ కౌన్సిల్ నిబంధనలను పాటించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు.

వాడీవేడిగా మున్సిపల్ సమావేశాలు

పిఠాపురం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పురపాలకసంఘ కార్యాలయంలోని కౌన్సిల్‌హాలులో ఛైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షతన జరిగిన మున్సిపల్ అత్యవసర సమావేశాలు వాడీవేడిగా జరిగాయి. కౌన్సిలర్లు బొజ్జా రామయ్య, పెదపాటి నాగేశ్వరరావు, కోళ్ల బంగారుబాబు, రాయుడు శ్రీనులు మాట్లాడుతూ మున్సిపల్ ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నాయని, ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు తీసుకునిపోతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 7వ సచివాలయంలో 12 కుర్చీలు, ఒక ప్రింటర్, కంప్యూటర్ చోరీకి గురైనట్టు కౌన్సిలర్ నల్లా రమణమ్మ ఫిర్యాదు చేసినా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. దీనిపై పోలీసు కేసు పెట్టామని కమిషనరు కనకారావు తెలిపారు. 7వ సచివాలయం ఆవరణలో కార్లు, ఇతర వాహనాలు పెడుతున్నారని, దాని వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు అల్లవరపు నగేష్ తెలిపారు. అగ్రహారం పాత ట్రెజరీ కార్యాలయంలో ఉన్న 6 ఫ్యాన్లను ఒక ప్రవేటు వ్యక్తి తీసుకుని వెళ్లిపోయారని, అతడిపై చర్యలు తీసుకోవాలని సోమరౌతు లలితాదేవి డిమాండ్ చేశారు. సాధారణ సమావేశం పెట్టకుండా అత్యవసర సమావేశాలు పెట్టడంలో ఆంతర్యం ఏంటని కౌన్సిలరు బొజ్జా జగదీశ్వరీ నిలదీశారు. మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు గైర్హాజరుకావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలి

కాకినాడ రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని శ్రీచైతన్య విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ ఏజీఎం హరిప్రసాద్ అన్నారు. స్థానిక శుభం కాపు కళ్యాణ మండపంలో బుధవారం ఐపీఎల్ క్యాంపస్ బాలికల సాంస్కృతిక, వారసత్వ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏజీఎం మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటూ సాంస్కృతిక, కళల పట్ల మక్కువ పెంచుకోవాలని సూచించారు. కళాశాల అధ్యాపకుడు పీవీఆర్ కుమారుడు పేరున ఏర్పాటుచేసిన పుట్టా ఆకాష్ ఫౌండేషన్ ద్వారా పేద, ప్రతిభ గల విద్యారులకు రూ.5లక్షల స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు. విద్యార్థుల నృత్యాలు, నాటికలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపాల్స్ ఏవోలు పాల్గొన్నారు.


స్కాలర్‌షిప్‌ను అందజేస్తున్న ఏజీఎం

పిఠాపురంలో విజిలెన్స్ అధికారుల తనిఖీ

పిఠాపురం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీ చేపట్టారు. పురపాలక సంఘం ద్వారా 14వ ఆర్థిక సంఘం సహా వివిధ గ్రాంటు, సాధారణ నిధులతో చేపట్టిన పనుల్లో అవకతవకలు జరిగాయని విజిలెన్స్ అధికారులకు పలువురు ఫిర్యాదులు చేశారు. విజిలెన్స్ డీఈ ఈ మధు ఆధ్వర్యంలో అధికారుల బృందం విచారణ చేపట్టింది. అగ్రహారం, డ్రైవర్స్ కాలనీ, మోహననగర్, జగ్గయ్యచెరువు కాలనీ తదితర ప్రాంతాల్లో జరిగిన వివిధ అభివృద్ధి పనులు, సీసీ రోడ్ల నిర్మాణం, పైపులైనుల ఏర్పాటు తదితరపనులు పరిశీలించి కొలతలు తీసుకున్నారు. పలులోపాలు వెలుగుచూసినట్లు సమాచారం.

ఖోఖో, కబడ్డీ పోటీలకు ఎంపిక

కాకినాడ సిటీ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఖోఖో, కబడ్డీ పోటీలకు కాకినాడ ఎంఎస్ నారాయణ కాలేజీ విద్యార్థినులు ఎంపికయ్యారు. చిత్తూరు జిల్లా కాణిపాకంలో జరిగిన అంతర్ జిల్లాల ఖోఖో పోటీల్లో తూర్పుగోదావరి జిల్లా బాలికల జట్టు ప్రథమస్థానంలో నిలవగా అందులో ఎంఎస్ నారాయణ కాలేజీ విద్యార్థినులు ఉన్నారు. అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కబడ్డీ పోటీల్లో పాల్గొన్నారు. జాతీయస్థాయి పోటీలకు ఖోఖో విభాగంలో డి.నందిని, కబడ్డీ విభాగంలో ఎం.మానస ఎంపికయ్యారు. కాలేజీలో బుధవారం అభినందన సభలో కళాశాల డైరెక్టర్ మతుకుమిల్లి శ్రీవిజయ్ మాట్లాడారు. ఏవో ప్రమోద్, వేణుగోపాలరావు పాల్గొన్నారు.



గ్యాస్ సిలిండర్లు సిద్ధంగా ఉంచుకోండి : జేసీ

గొల్లప్రోలు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఉచిత గ్యాస్ బుకింగ్‌కు అనుగుణంగా సిలిండర్లను పంపిణీకి సిద్ధంగా ఉంచుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టరు రాహుల్ మీనా సూచించారు. గొల్లప్రోలు విశ్వనాథ సత్యసాయి గ్యాస్ ఏజెన్సీని ఆయన బుధవారం పరిశీలించారు. ఇప్పటివరకూ జరిగిన ఉచిత గ్యాస్‌బుకింగ్‌పై ఆరా తీశారు. నగరవనం కోసం చేబ్రోలు కంకరగని భూమిని, చెందుర్తిలో పెట్రోల్ బంకు ఏర్పాటు కోసం ప్రతిపాదించిన స్థలాన్ని ఆయన పరిశీలించారు. గొల్లప్రోలు తహశీల్దారు సత్యనారాయణ, ఎంపీడీవో కర్రి స్వప్న ఉన్నారు.


గ్యాస్ సిలిండర్ బుకింగ్‌ను పరిశీలిస్తున్న జేసీ

'అధికారులకు పాత్ర ఉందా'

గొల్లప్రోలు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు కల్యాణమండపాలు, ఫంక్షన్‌హాల్స్ వద్ద అనధికారిక వసూళ్లకు పాల్పడుతూ, ఆ సొమ్ములను నగరపంచాయతీకి జమచేయకుండా అన్యాక్రాంతం చేస్తున్నా ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని కౌన్సిలర్లు నిలదీశారు. ఇందులో అధికారులకు పాత్ర ఉందా అని ప్రశ్నించారు. గొల్లప్రోలు నగరపంచాయతీ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ గండ్రేటి మంగతాయారు అధ్యక్షతన బుధవారం జరిగిన కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశాల్లో కౌన్సిలర్లు గండ్రేటి శ్రీరామచంద్రమూర్తి, గంటా అప్పలస్వామి, గుళ్ల సుబ్బారావులు మాట్లాడుతూ కాంట్రాక్టు వర్కరుగా ఉన్న యర్రంశెట్టి సత్యమోహన్ నగరపంచాయతీకి చలానా కట్టాలంటూ ఒక్కో కల్యాణమండపం వద్ద రూ.2వేలు నుంచి 3వేలు వరకూ వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

3వ బెటాలియన్ కమాండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన దీపిక పాటిల్



సర్పవరం జంక్షన్, అక్టోబరు 30(ఆంధ్ర జ్యోతి): ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్‌గా ఎం.దీపిక పాటిల్ బాధ్యతలు స్వీకరించారు. బుధవారం ఉదయం ఏపీఎస్పీ బెటాలియన్‌కి విచ్చేసిన కమాండెంట్ దీపిక పాటిల్‌కు అదనపు కమాండెంట్ దేవానందరావు మొక్కతో స్వాగతం పలికారు. సిబ్బంది ఘన స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం బెటాలియన్ అధికారులతో సమావేశమయ్యారు. యూనిట్ క్యాంటీన్,యూనిట్ స్టోర్స్, యూనిట్ ఆసుపత్రి, మినరల్ వాటర్ ప్లాంట్ గెస్ట్ హౌస్, మోటార్ ట్రాన్స్‌పోర్టు, పార్కులను సందర్శించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు మురళీకుమార్, మన్మధరావు, యూనిట్ డాక్టర్ డాక్టర్ లక్ష్మీదేవి, ఆర్ఐలు తదితర అధికారులు పాల్గొన్నారు.

పాల ధర తగ్గింపు నిర్ణయం ఉపసంహరించుకోవాలి : ఎమ్మెల్యే రాజప్ప

సామర్లకోట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి పాల సేకరణ చేస్తున్న విశాఖ డెయిరీ ధర చెల్లింపులు తగ్గించడం వల్ల పాడి సంపద ద్వారా జీవనం సాగిస్తున్న పశుపెంపకందారులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదమున్నందున తక్షణం పునరాలోచన చేయాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కోరారు. బుధవారం రాత్రి సామర్లకోటలో విలేకరులతో మాట్లాడుతూ సహకార చట్టంలో ఉన్న విశాఖ డెయిరీని కంపెనీ చట్టంలోకి తెచ్చిన యాజమాన్య కుటుంబం తమ జాగీరులా మార్చుకుని రైతులకు కనీస హక్కులు లేకుండా చేయడం అమానుషమన్నారు. తక్షణం పాల సేకరణ ధరను లీటరుకు రూ.10కు పెంచడంతో బాటూ రైతులకు పశు దాణా, రుణాలు, తదితర సదుపాయాలు కల్పించాలని విశాఖ డెయిరీ యాజమాన్యానికి సూచించారు. ఈ విషయంలో పశుపెంపకందారులు ఏమాత్రం నష్టపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సామర్లకోటలో గాంధీబొమ్మ సమీపాన టీడీపీ నాయకుడు చంద్రు బలరామ్ సౌజన్యంతో ఏర్పాటుచేసిన శివుడి విగ్రహ ప్రతిష్ఠలో బుధవారం ఎమ్మెల్యే చినరాజప్ప పాల్గొని పూజలు నిర్వహించారు. శివుడి విగ్రహంతో పాటు నంది శిలా విగ్రహాల పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

'కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

గొల్లప్రోలు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ అనుబంధ ఏపీ మున్సిపల్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గొల్లప్రోలు నగరపంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీఐటీయూ నాయకులు కుంచే చిన్నా, కరణం విశ్వనాథం, శానిటేషన్‌వర్కర్స్ తదితరులు ఉన్నారు.

పరిహారాన్ని రికవరీ చేయాలి : వర్మ

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నాసికరం గుడ్లు సరఫరా చేసి పట్టు రైతులు నష్టపోవడానికి కారణమైన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి పరిహారాన్ని వారి నుంచి రికవరీ చేయాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, పట్టురైతులు డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టర్ సగిలి షాన్ మోహన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కర్నాటకలోని రామ్‌నగర్‌సెంట్రల్ సిల్క్‌బోర్డు సరఫరా చేస్తున్న పట్టు గుడ్లు నాసిరకం కావడం వల్ల గూడు కట్టడం లేదని, దీని వల్ల రైతులు సుమారు కోటి రూపాయిలకు పైగా నష్టపోయారని కలెక్టరు దృష్టికి తీసుకొచ్చారు. కకూన్ ఇన్సెంటివ్ బకాయిలు నాలుగేళ్లుగా రాష్ట్రంలోని పట్టురైతులకు రూ.60కోట్లు రావాల్సి ఉండగా, పిఠాపురం నియోజకవర్గంలోని రైతులకు రూ.2కోట్లు రావాల్సి ఉందని తెలిపారు. టీడీపీ మండలాధ్యక్షుడు ఉలవకాయల దేవేంద్రుడు, మడికి ప్రసాద్,ఓరుగంటి వీరబాబు, పట్టురైతులు ఉన్నారు.

దుర్గాడలో ప్రత్యేక పూజలు

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): దుర్గాడ శివాలయంలో మాసశివరాత్రి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామికి మహాన్యాస పారాయణ, 11 రుద్రాలు, 21రకాల ద్రవ్యాలతో విశేష అభిషేకాలు నిర్వహించి పుష్పాలతో ప్రత్యేకంగాఅలంకారం చేశారు.

6వరోజు క్లాప్ డ్రైవర్ల ఆందోళన

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ క్లీన్ ఆంధ్రప్రదేశ్(క్లాప్) వాహన డ్రైవర్ల బకాయి జీతాలు చెల్లించాలని ఈ నెల 25న ప్రారంభించిన ఆందోళన 6వరోజైన బుధవారం కొనసాగించారు. మున్సిపల్ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. క్లాప్ వాహన డ్రైవర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు పలివెల వీరబాబు, సీనియర్ సభ్యుడు ఎం.శివశంకర్, క్లాప్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు సంతోష్, ఇస్మాయిల్, విక్టర్ ఉన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవల తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం

రంపచోడవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవల తీరుపై ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆమె ఆసుపత్రిని సందర్శించి రోగులతో మాట్లాడారు. సదరం సర్టిఫికెట్ల జారీలో భారీ అవినీతి జరిగిందని, రంపచోడవరం పరిధిలోని వారికి మాత్రమే సర్టిఫికెట్లు మంజూరు చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. ల్యాబ్ టెస్ట్, మలేరియా సెక్షన్‌లో సిబ్బంది అందుబాటులో లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. సిబ్బంది మామూళ్లకు అలవాటు పడి గిరిజనుల నుంచి సొమ్ములు వసూలు చేస్తుండటం తమ దృష్టికి వచ్చిందని, వారిపై చర్యలు ఉంటాయని తెలిపారు. ఆమె వెంట తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు మఠం విజయభాస్కర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

వీఆర్‌పురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేఖపల్లికి చెందిన ఎస్‌కే ఇబ్రహీం, వడ్లాణపు సత్యనారాయణ శస్త్ర చికిత్సకు అవసరమైన సొమ్ము కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఇబ్రహీంకురూ.87,056, సత్యనారాయణకు రూ.56,273 మంజూరు చేస్తూ చెక్కులు వచ్చాయి. వాటిని బాధితులకు ఎమ్మెల్యే శిరీషదేవి అందజేశారు.

'బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు'

దేవీపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎవరైనా మద్యం బెల్టు షాపులు నిర్వహించినా, అందుకు సహకరించినా కఠిన చర్యలు తప్పవని దేవీపట్నం ఎస్ఐ షరీఫ్ హెచ్చరించారు. బెల్టు షాపులు నిర్వహించే వారిపై కేసు నమోదు చేస్తామన్నారు.

ఉచిత వైద్య శిబిరం

అడ్డతీగల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలం లోని లోతట్టు గ్రామమైన వీరవరంలో ఆంధ్ర వనవాసీ కల్యాణ ఆశ్రమం ఆధ్వర్యంలో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన బీజేపీ జిల్లా కార్యదర్శి స్వప్నకుమారి శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యాధికారి శ్రీనివాస్ బృందం వైద్య సేవలు అందించగా గౌతు లచ్చన్న మందులను ఉచితంగా పంపిణీ చేశారు.

బొద్దవరంలో పొలంబడి

కోటనందూరు, అక్టోబరు30: బొద్దవరంలో పొలంబడి కార్యక్రమంలో ఏవో పాల్గొన్నారు.

'ఆదిత్య' ప్రొఫెసర్‌కు డాక్టరేట్


సాయికృష్ణ

గండేపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్శిటీ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ వేదాంతం సాయికృష్ణకు మహారాణా ప్రతాప్ యూనివర్శిటీ ఆఫ్ అగ్రికల్చరల్ అండ్ టెక్నాలజీ నుంచి డాక్టరేట్ లభించింది. డెవలప్‌మెంట్ ఆఫ్ ఎన్‌ఐటీటీ బేస్డ్ ఇవేక్యువేటెడ్ ట్యూబ్ సోలార్ ఎయిర్ హీటర్ అసిస్టెడ్ విత్ థర్మల్ స్టోరేజ్ సిస్టమ్ ఫర్ ఫుడ్ డ్రైయింగ్ అనే అంశంపై ఆయన సమర్పించిన థీసిస్‌కు మహారాణా ప్రతాప్ యూనివర్శిటీ ఆఫ్ అగ్రికల్చరల్ అండ్ టెక్నాలజీ, ఉదయ్‌పూర్ రాజస్థాన్ డాక్టరేట్‌ను ప్రకటించిందని ఆదిత్య వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్‌రెడ్డి తెలిపారు. సాయికృష్ణను ఆదిత్య చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరెడ్డి, డీన్ డాక్టర్ రమాశ్రీ, విభాగాధిపతి డాక్టర్ ఎంవి రాజేష్ అభినందించారు.

జగ్గారాయుడు చెరువుపై విచారణ


శృంగరాయునిపాలెంలో విచారణ దృశ్యం

కిర్లంపూడి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఆదేశాల మేరకు మండలంలోని శృంగరాయునిపాలెం గ్రామంలోని జగ్గారాయుడు చెరువుపై బుధవారం విచారణ నిర్వహించారు. డీపీవో వి.రవికుమార్, డీఎల్‌పీవో ఎం.బాలమణి, ఈవోఆర్డీ విచారణ చేపట్టారు. గ్రామస్తులంతా ఏకమై చెరువుని మత్స్యకార సొసైటీకి ఇవ్వొద్దని ప్రజా అవసరాల నిమిత్తం మంచినీటి చెరువుగా మార్చాలని డీపీవోకు విజ్ఞప్తి చేశారు. సభలో సర్పంచ్ పట్టు చంటిబాబు, సెక్రటరీ కిడారి జ్యోతి, ఫిషర్‌మెన్ సొసైటీ ప్రెసిడెంట్ గుర్రిర్ర వీర్రాజు పాల్గొన్నారు.

'విమానాశ్రయం ప్రతిపాదనను విరమించాలి'


తహశీల్దార్‌కు వినతి అందిస్తున్న రైతులు

తొండంగి, అక్టోబరు 30: బెండపూడి సమీపంలో ఏర్పాటు చేయదలచుకున్న విమానాశ్రయ ప్రతిపాదనను విరమించాలని ఆ గ్రామ రైతులు తొండంగి తహశీల్దార్ మురార్జీకి వినతి పత్రం అందించారు. బుధవారం గోపాలపట్నంలో జరుగుతున్న రెవెన్యూ సదస్సుకు హాజరైన రైతులు ఇప్పటికే తాము అనేక పథకాలకు భూములిచ్చి తీవ్రంగా నష్టపోయామని, విమానాశ్రయానికి కూడా భూములు తీసుకుంటే తామంతా బికారులుగా మారవలసి వస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతిపాదన విరమించుకునే విధంగా వాస్తవ పరిస్థితులను ప్రభుత్వానికి తెలపాలని వారు కోరారు. పాలచర్ల సుబ్బారావు, బాబూరావు, మోగంటి సూర్యనారాయణ, రాయవరపు ఆనంద్, శాస్త్రి, గొల్లు సత్యన్నారాయణ తదితరలు ఉన్నారు.

'పశుగణన నిర్వహించాలి'

ఏలేశ్వరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పశుగణన సక్రమంగా నిర్వహించాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పశుగణన కరపత్రాలను ఎంపీపీ ఆవిష్కరించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్యనారాయణ, ప్రత్తిపాడు పశుసంవర్ధక శాఖాధికారి చిక్కం బాలచంద్ర యోగేశ్వరరావు, ఎస్.వరలక్ష్మి, సుంకర సత్తిబాబు ఉన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి : యనమల


విద్యార్థులను అభినందిస్తున్న యనమల

తుని రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో రాణించాలని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు కోరారు. తేటగుంట జిల్లా పరిషత్ హైస్కూలుకు సంబంధించిన ఇటీవల రాష్ట్రస్థాయి అండర్-14 బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి విద్యార్థులు ఉపాధ్యాయ బృందంతో యనమలను తేటగుంట క్యాంపు కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. యనమల విద్యార్థులను అభినందించారు. పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు చామంతి దుర్గారావు, పీఈటీ జ్యోతి, గజ్జి రాంబాబు పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలను నిరోధించాలి

అక్రమ మైనింగ్ తవ్వకాలను అధికారులు నిరోధించాలని లేకుంటే వారే బాధ్యత వహించాల్సి ఉంటుందని యనమల హెచ్చరించారు. మైనింగ్, ఇసుక తవ్వకాలతో ప్రభుత్వ పాలసీని కట్టుదిట్టంగా అమలుచేయాల్సిన బాధ్యత అధికారులదే నని ఈ విషయంలో చూసీచూడనట్లు వ్యవహరిస్తే సంబంధిత అధికారులను బాధ్యత చేస్తామని తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా లైసెన్స్ పొంది గ్రావెల్ తవ్వకాలు చేసుకుంటే అభ్యంతరం లేదని కానీ కొందరు దొంగచాటు వ్యవహారాలు నడిపిస్తున్నట్లు తెలుస్తుందన్నారు. ఇటువంటి అక్రమాలకు పాల్పడిన వారిని ఉపేక్షించవద్దని ఆదేశించారు. తుని పరిసర ప్రాంతాల్లో కొండ గ్రావెల్‌తోపాటు పోలవరం మట్టిని కొంత మంది గుట్టుచప్పుడు కాకుండా తరలించేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసి అధికారులు సూచనలు ఇచ్చారు.

పశుగణన పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

ప్రత్తిపాడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పశుగణన పోస్టర్లను బుధవారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆవిష్కరించారు. ఆర్‌అండ్‌బీ అధికారులతో నియోజకవర్గంలోని ఆర్‌అండ్‌బీ రహదారుల పరిస్థితిపై సమీక్షించారు. అండ్‌బీ అధికారులు డీఈ రాఘవరావు, జేఈ సాయికిరణ్ ఉన్నారు.

రాజశేఖర్‌కు మద్దతు తెలపాలి

కిర్లంపూడి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్‌కు ఓటేసి మద్దతు తెలపాలని ఉపాధ్యాయులను జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ కోరారు. బుధవారం మండలంలోని కిర్లంపూడి, తామరాడ, వీరవరం, గెద్దనాపల్లి, వేలంక పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులను కలిసి సమావేశమయ్యారు. గ్రాడ్యుయేట్ ఓట్లను గడువు తేదీలోగా నమోదు చేసుకోవాలన్నారు. డిగ్రీ పూర్తి చేసుకుని మూడేళ్ల గడిచినవారు ఓటు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. తమ అధినేత పవన్ ఆదేశాలతో ఓట్ల నమోదుకు విస్తృతంగా కృషిచేస్తున్నట్లు తెలిపారు. ఎల్లపు దొరబాబు, ముర్రా సహదేవుడు, గంధం ప్రభాకర్, నందిబాబు, ఎలుగుబంటి శివ, ఆకుల నవీన్, ఎంపీటీసీ గోకేడ రాజా, కాయల మణికంఠ, గోకేడ ప్రసాద్, పాలెం బాబ్జి ఉన్నారు.

'ప్రణాళికలు రూపొందించుకోవాలి'

తుని రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ ప్రకాష్ విద్యాసంస్థలను ఐపీఎస్, ఐజీ డైరెక్టర్ ఎస్ఐఎస్‌పీ హైదరాబాద్‌కు చెందిన కె సునీల్ ఇమ్మానియేల్ సందర్శించారు. పాయకరావుపేట క్యాంపస్‌లో విద్యార్థులతో సమావేశమై మాట్లాడుతూ విద్యార్థులు సౌఖ్య పరిధి దాటి బయటకు వచ్చి సవాళ్లను ఎదుర్కోవాలని ప్రతీ ఒక్కరు ప్రణాళికలను రూపొందించుకుని అమలుదిశగా ముందుకు సాగాలన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్ ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుడి నమూనాలయం వద్ద వాటర్‌ప్లాంట్ ప్రారంభం


వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

అన్నవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జాతీయరహదారిపై ఇటీవల ప్రారంభించిన సత్యదేవుడి నమూనాలయం వద్ద దివీస్‌సంస్థ నెలకొల్పిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను సంస్థ ప్రతినిధులతో కలసి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.రామకృష్ణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే దేవస్థానంలో దివీస్ ఆధ్వర్యంలో 7జలప్రసాదం కేంద్రాలు, 8 వాటర్‌కూలర్లు, 9 ఆర్వో ప్లాంట్‌లను ఏర్పాటుచేశారని దీని వల్ల నిత్యం సుమారు 40వేలమందికి స్వచ్ఛమైన శుద్ధిచేసిన తాగునీరు భక్తులకందుతుందన్నారు. కార్యక్రమంలో డీఈ విశ్వనాధుల సత్యనారాయణ, దివీస్ ప్రతినిధులు ఆర్.సుధాకర్, బి.వాసుబాబు తదితరులున్నారు.

సీసీరోడ్ల పనుల ప్రారంభం

ఏలేశ్వరం, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): యర్రవరంలో ఉపాధి హామీ పథకం నిధులు సుమారు రూ.16లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు టీడీపీ నాయకులు బస్వా ప్రసాద్, మైరాల కనకారావు కొబ్బరికాయలు కొట్టి భూమి పూజచేశారు. ఏపీవో సంగీతలక్ష్మీ ఉన్నారు.



చింతూరులో ప్రదర్శన నిర్వహిస్తున్న ఆదివాసీలు

జీవో నెం.3 పునరుద్ధరించాలి

చింతూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో జీవో నెం. 3ని పునరుద్ధరించాలని ఆదివాసీలు బుధవారం చింతూరులో భారీ ర్యాలీ నిర్వహించారు. చింతూరు సెంటరు నుంచి ఐటీడీఏ కార్యాలయం ప్రదర్శన జరిపారు. ఈ సందర్భంగా పలువురు ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ జీవో నెం.3ని రద్దు చేయడంతో ఆదివాసీ యువత నిరుద్యోగులుగా మిగిలి పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎన్నికల ప్రచారంలో జీవో నెం.3 పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటానని ఇచ్చిన హామీపై సీఎం చంద్రబాబు దృష్టి సారించాలన్నారు. ఏజెన్సీలో ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. వంద శాతం ఉద్యోగాలు ఆదివాసీ యువతకే కేటాయించాలన్నారు. మెగా డీఎస్సీ నిర్వహణలో ఏజెన్సీ పోస్టుల నియామకాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. హక్కుల కోసం ఆదివాసీలంతా ఏకతాటిపై నిలిచి పోరాడాలన్నారు. నిరంతర ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బంగారు వెంకటేశ్వర్లు, నాయకులు పూనెం చిన్నబిక్షం, చిచ్చడి మురళి, మడివి రాజు, సీసం సురేష్, పూనెం సంతోష్‌కుమార్, సవలం కోటి, పులి అశోక్, ఆత్రం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్: తహసీల్దారు విచారణ

వై.రామవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవరమడుగుల పెద్దేరు వాగు వద్ద ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను రంపచోడవరంసబ్ కలెక్టర్ కల్పశ్రీ సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీనిపై తహసీల్దారు వేణుగోపాల్ బుధవారం విచారణ జరిపారు. ఒక ట్రాక్టర్‌కు సంబంధించి ప్రభుత్వం మంజూరు చేసిన కాలనీకి ఇసుక తరలించినట్టు విచారణలో తేలింది. మిగిలిన రెండు ట్రాక్టర్లలో ఇసుక తరలింపుపై ఎంక్వైరీ చేస్తున్నామని, నివేదికను సబ్ కలెక్టర్‌కు సమర్పిస్తామన్నారు. తహసీల్దారు వెంట ఆర్ఐ శాంత కుమారి వున్నారు.




డీఏవీ పాఠశాలలో దీపావళి వేడుకలు

మోతుగూడెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఏవో పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు మల్లెల రఘురాం ఆధ్వర్యం లో దీపావళి వేడుకలు నిర్వహించారు. లక్ష్మీదేవి చిత్రపటానికి పూజ చేశారు. విద్యార్థులతో కాకర పువ్వొత్తులను హెచ్‌ఎం కాల్పించారు. బాణసంచా వద్ద జాగ్రత్తగా ఉండాలని పిల్లలకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



లక్ష్మీపురం పీహెచ్‌సీ ఎదుట సిబ్బంది నిరసన

ఎటపాక, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీపురం పీహెచ్‌సీలో దాడి చేసి వైద్య పరికరాలను ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏవీఎస్పీ) రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు సీతమ్మ డిమాండ్ చేశారు. ఈ ఘటనకు పీహెచ్‌సీ ఎదుట వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు నిరసన తెలిపారు. పీహెచ్‌సీల్లో నైట్ డ్యూటీల సమయంలో సిబ్బందికి భద్రత కల్పించాలని కోరారు.